

# అయితే నా రెండెకరాలు గోవిందేనా!!

నేనూ చిన్నారీ '51-ఇ కోఠీ-యూసుఫ్‌గూడా' బస్సెక్కి ఇల్లు చేరేటప్పటికి చీకటడిపోతుంది, ఏం చేస్తాం మరి మా నాన్నకి ట్రాన్స్‌ఫర్ ఆలీసమవడంతో మేం హైదరాబాదు చేరేటప్పటికి అన్ని స్కూళ్ళకీ దసరా సెలవలు కూడా ఇచ్చేశారు. ఇంక ఏ మంచి బళ్ళోకి మమ్మల్ని రానిస్తారు? ఎక్కడా సీటు దొరకలా. చివరికి ఆంధ్రా మెట్రిక్కు కట్టేద్దామా అని కూడా అనుకున్నా. నాకో తోకుందిగా చిన్నారని. అది కూడా మెట్రికు పరీక్ష నాతో బాటే రాస్తానని మొదలెట్టింది. దాంతో నాకు భయం వేసి పోయి, పోనీలే ఏ బడయితే ఏం అని అన్నీ తిరగ్గా తిరగ్గా చిట్ట చివరికి ఆబిడ్సు పోస్టాఫీసు వెనకాతల 'గోషామహల్ గవర్నమెంటు గరల్స్ హైస్కూల్' అని అందులో సీటు దొరికింది.

మా స్కూలు బయట నించి చూస్తే పేద్ద పాతగేటు. ఆ... లోపలే వుంటుందిలే 'అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఒక్కసారి లోపలి కడుగుపెడితే కళ్లు తిరిగిపోతాయి. అంతెత్తు భవంతులు ఎవరో నవాబు గారివిట. వెయ్యిమంది పిల్లలు తిరుగుతున్నా అలికిడి

వున్నట్టు వుండదు. అంత పెద్దవన్నమాట. ఆఫీసులో కెళ్లాలంటే కనీసం వంద మెట్లెక్కాలి! అన్నీ పెద్ద పెద్ద హాళ్లూ వరండాలూ ! ఒక్కో హాల్లో నాలుగు క్లాసులు నాలుగు మూలలకీ, క్లాసులో గానీ తలపైకెత్తి చూశామో అలా ఆ రంగు రంగుల అద్దాలూ లతలూ చూస్తూ వుండిపోతాం - ఎవరన్నా నవ్వో తిట్టో మన్ని కదిపే వరకూ ! ఇక్కడ పాఠాలు తెలుగులోనూ ఉర్దూలోనూ కూడా చెప్తారు కదా ! కానీ ఉర్దూ పిల్లలకి పక్క మేడలోనే క్లాసులు. ఆ పిల్లలు పరదాలు కట్టిన రిక్షాలోంచి దిగుతారు. తెల్లగా సన్నగా బోల్డు కాటికెట్టుకుని పెద్ద జడలతో ఎంత అందంగా వుంటారో! మనం మామూలుగా పుట్టబట్టి హాయిగా ఏ రోడ్డు మీదన్నా తిరిగేస్తాం కానీ అంత అందంగా వుంటే చచ్చినట్లు పరదాలు కట్టుకు తిరగాల్సిందే. దృష్టికదా!

అసలు నా స్కూలు చదువయిపోయే లోపల నేను మళ్లీ క్లాసు ఫస్టు రావాలంటే స్కూలు మారాల్సిందే అని నేనే మొదట్నించీ చెప్తూనే వున్నా కదా ! అదిప్పటికి కుదిరింది. ఈ స్కూల్లో నేను ఏ. భారతిని. చదువయినా, ఏసిసి అయినా డ్రామాలయినా అన్నిటికీ ముందు నా పేరే. ఇక్కడ లక్ష్మి టీచరూ, నాగవల్లీ టీచరూ ఎంతో బాగా చదువు చెప్తారు. కానీ ఏవిటో పిల్లలే శ్రద్ధ పెట్టి చదవరు. పిల్లలు చదవకపోతే టీచర్లు మాత్రం ఏం చేస్తారు పాపం !

ఈవేళ క్లాసులో ఏవో పిచ్చి కబుర్లేసుకుని కూచోడంతో మాకు నాలుగున్నర బస్సు తప్పి పోయింది. మళ్లీ ఆరుంపావు వరకు బస్టాండులో నిలబడాల్సిందే కదా! అదే బస్సు యూసుఫ్ గూడా వెళ్లి మళ్లీ కోఠీ వెళ్లి అక్కడ్నించి ఆబిడ్సు స్టాపుకి రావాలి. కానీ బస్సు తప్పిపోతే ఒక్క లాభం వుంది ! అక్కడ పుస్తకాల కొట్టువాడు మమ్మల్ని అన్ని పత్రికలూ పుస్తకాలూ ఫ్రీగా చదువు కోనిస్తాడు. దాంతో ఆకలీ తెలియదు టైమూ తెలియదు. ఇంటికొచ్చి బట్టలు మార్చుకుని మంచినీళ్లు తాగుతుంటే బుజ్జొచ్చిందక్కడికి ఏదో ముఖ్యమయిన పనున్నట్లుగా మొఖం పెట్టుకుని!

''సుశీలా! నాన్న మరేం మురమండ వీరేశ్వరుడి గుడికి ముప్పై సెంట్లిచ్చేస్తారుట!''

''ముప్పై సెంట్లివ్వడవేవిటే'' అనడిగా!

''మరేం! పొద్దున్న పెద్దత్తయ్యతో నాన్న చెప్తుంటే విన్నా! ముప్పై సెంట్లు గుడికేట''

''మరి మిగతాది?''

అక్కడ్నించి ఇందు చెప్పింది మిగతా కథ. కాదే మధ్యాహ్నం పూట నాన్న అన్నం తింటుంటే పెద్దత్తయ్య వచ్చి 'వెంకటేశూ! నలుగురాడపిల్లలూ ఎలా ఎదిగొస్తున్నారో చూస్తు న్నావా? వాళ్లపెళ్ళిళ్లూ పేరంటాలూ గురించి ఆలోచన ఏవన్నా వుందా' అనడిగారు.

నాన్న అన్నం తింటూ తింటూనే 'నాకేం భయం అక్కా! నా పిల్లలు బంగారాలు. వచ్చి నంత వరకూ చదువు చెప్పిస్తా. నాన్నిచ్చిన ఎనిమిదెకరాలూ నాకేవన్నా మగపిల్లలున్నారా! అంతా

వీళ్లకేగా. తలా రెండూ ఇచ్చేస్తా. ఇంక పెళ్లిళ్లు వాళ్లిష్టం అన్నారు. అక్కడితో ఆపకుండా అత్తయ్య మరి పై ముప్పై సెంట్లూనో! అని రెట్టిస్తే అవి గుడికిచ్చేస్తానన్నారు'' అంటూ మొత్తం పూస గుచ్చినట్లు చెప్పింది.

''ఇందూ ! నా రెండెకరాల్లో మామిడి చెట్లేయిస్తా! హాయిగా వేసంకాలం బోల్డు మావిడి పళ్లు తింటా'' అని బుజ్జి, మురిసిపోవడం మొదలెట్టింది.

''ఆ! తిను! తిను! వేసంకాలం మామిడిపళ్లు తింటే మిగతాప్పుడేం తింటావ్? మేక లాగా ఆకులు తింటావా ? పద పద ! నీచేత ఆ హోంవర్కు పూర్తి చేయించకపోతే అమ్మ నన్ను వాయిస్తుంది'' అని దాన్ని పుస్తకాల దగ్గరకి లాక్కెళ్లా.

అసలు నాకు ఈ పెద్దవాళ్లందరి మీదా వళ్లు మండిపోతోంది. అందరూ చీటికీ మాటికీ నాన్న దగ్గరకొచ్చి నీకు నలుగురాడపిల్లలు కదా ! ఎలాగా ? ఎలాగా ! అని కాల్చుకు తింటారేవిటి? తన విషయం తనకి తెలియదా . మేం నలుగురవయితే ఆవిడకెందుకూ ! నలభై మందివయితే ఆవిడకెందుకూ. ఈసారి కూడా అమ్మకి ఆడపిల్ల పుడితే సరి అందరి తిక్క కుదురుతుంది. చిన్న పిల్లల ముందు పెళ్లిళ్లు అంటే ఎంత సయ్యంగా వుంటుందీ ! తప్పు కదూ ! అందుకే నాన్నలా అని వుంటారు !

కానీ ఏవిటో ఇందాకట్నించీ అమ్మా కనబడదు ! ఆవిడగారి అసిస్టెంటు శ్యామలక్క కనబడదు. ఎక్కడికెళ్లిపోయారో ఇద్దరూ ! అమ్మమ్మ కనబడింది తాతగారి గదిలో బియ్యం ఏరుతూ!

''అమ్మా, అక్క ఏరమ్మమ్మా'' అనడిగా.

''ఏవే ! మీ జమీందారీలు సాకడానికి మీ నలుగురూ చాల్లేదా? ఈసారీ ఆడపిల్లే పుడితే ఏం చేస్తారుట మీరూ మీ నాన్నా ! చూడు మీ అమ్మ! మగపిల్లాడో అని గోలెట్టి ప్రాణం మీదకి తెచ్చుకుంది!''

''అసలు అమ్మెక్కడుందో చెప్పమ్మమ్మా''

''అక్క తనూ పొద్దున్నే డాక్టరుకి చూపించుకోవాలని వెళ్లారా ? ఎనిమిదో నెలన్నా సగం పడలేదు. ఆస్పత్రిలో చేర్చేసుకుందిట. ఇంక మీకు తమ్ముడో తుమ్ముడో పుట్టేవరకూ అన్నీ అక్కడే మంచం మీదేట. ఉప్పులేని భోజనం పంపాలట నేను రోజూ''

ఇంక మా ఇంట్లో అందరికీ ఎంత బెంగొచ్చేసిందో! నెల్లాళ్ల పాటు ఆస్పత్రిలో వుండా లంటే మాటలా ! అసలెందుకు మంచం దిగకూడదో ! వుప్పు లేకుండా అన్నం తినమనడం ఏవిటో ! మనిషి చూస్తే శుబ్బరంగా జాంపండులా వుంది. హాయిగా నిద్దరోతోంది. ఉప్పు లేపోయినా అన్నం బాగానే తింటోంది. మరి డాక్టరలా ఎందుకు చెప్పిందో ! అయినా డాక్టర్లు

కూడా అలా వుత్తుత్తినే భయాలు పెట్టేసి చేర్చేసుకుంటారట ఎక్కువ డబ్బులొస్తాయని.

ఏవయినా అమ్మ నెల్లాళ్లు ఆబిడ్సు తాజ్‌మహల్ ఎదురు ఆస్పత్రిలో చేరడంతో మా పంట పండింది. స్కూలొదలగానే రిక్షా ఎక్కేసి ఆస్పత్రికెళ్లిపోడం మమ్మల్ని చూడగానే అమ్మ ఓసారి కళ్ల నీళ్లు తెచ్చేసుకుని తలా అయిదణాలూ ఇచ్చి మసాలాదోసె తిని రమ్మనడం. నాన్నొచ్చే వరకూ అన్ని వార్డులూ తిరిగి నాన్నతో ఇల్లు చేరడం. ఇదీ రోజూ మా కార్యక్రమం.

నెల్లాళ్లిట్టే గడిచిపోయాయి. శుక్రవారం ఆపరేషన్ చేయకపోతే తల్లికో బిడ్డకో ప్రమాదం జాతకాలని బట్టి ఆపరేషన్ చెయ్యాలని డాక్టరూ, రాక్ వీల్లేదూ ! ఆదివారం కార్తీక షష్ఠీ 9-15 నిమిషాలకి ఆపరేషన్ చెయ్యాలని తాతగారూ, ఇద్దరి మధ్యా అమ్మమ్మా, అక్కా నలిగిపోవడం, చివరికి తాతగారే నెగ్గారు కదా !

శనివారం సాయంత్రం నాన్న నన్నో పక్కకి పిల్చి ''సుశీలా ఎవరూ చూడకుండా అమ్మమ్మ దేవుడ్నోడ్ని పట్రా! మనం రహస్యంగా తలుపులేసుకుని భజన చేద్దాం'' అన్నారు. నాకయితే భలేనవ్వూ, భయమూ రెండూ వచ్చాయి. ఎప్పుడు గుళ్లోకెడదాం రమ్మన్నా రానని బిగదీసుకునే నాన్నకి ధైర్యం ఏవయిపోయిందో! ఆపదొచ్చేటప్పటికి తలుపులేసుకుని భజన చేయడానికి రెడీ అయిపోయారు. అమ్మమ్మ దేవుళ్లల్లోంచి వినాయకుడి బొమ్మ తీసుకొచ్చి తలుపు లేసుకుని మేం అయిదుగురం నిమ్మళంగా హరేరామా హరేకృష్ణా అని అయిదారుసార్లు పాడి మళ్లీ దేవుడ్ని అక్కడ పెట్టేశాం. ఇంకేవన్నా దేవుడి పాటలు గుర్తుంటే కదా !

తెల్లారకుండా ఆస్పత్రికి చిన్నా పెద్దా కలిపి ఇరవై ఎనిమిది మందివి చేరాం. డాక్టరు గారు రాగానే అమ్మమ్మ ఆవిడ కాళ్లు పట్టేసుకుంది. ఓ గంటలో ఆవిడ బయటికి వచ్చి మగపిల్లవాడు కానీ అద్దాల్లోంచి చూడండి అనివెళ్లిపోయారు. చూద్దుం కదా తెల్లగా చిన్నగా గులాబీపువ్వులా ఎంత బాగున్నాడో, నాన్నకి కళ్లంట ఒకటే నీళ్లు. తాతగారు చూసి వీడు దుర్యోధన చక్రవర్తంత వాడవుతాడే అని తనమాట నెగ్గిందని మహా సంతోషపడిపోయారు.

బుజ్జి నెమ్మదిగా నా పక్కకి చేరింది ''సుశీలా ! అయితే మన రెండెకరాలూ గోవిందేనా?'' అనడగింది.

''ఆ! అంతేగా మరి! ఇదిగో వీడ్ని మావిడి తోటెయ్యమని మనందరం వేసంకాలం వెళ్లి పళ్లు తిందాంలే! ఎంత ముద్దుగా వున్నాడో చూడు! ఎంచక్కా ఆడుకోవచ్చు కదా!'' అని నలుగురం అమ్మ మాటే మర్చిపోయి వాడ్నలా చూస్తూ వుండిపోయాం.